పంట మార్పిడి.. అధిక దిగుబడి

- పంటల సాగులో వైవిధ్యం చూపితే అనేక ప్రయోజనాలు
- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు అవకాశం
- తరచూ ఒకే పంట వేయడం వల్ల చీడపీడల ఉధృతి అధికం
- మార్పిడితో సేంద్రియ పదార్థాల వృద్ధి



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కృష్ణగిరి: పొలంలో ప్రతిసారి వేసిన పంటనే మళ్లీ వేయడం వల్ల దిగుబడులు తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించ వచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం కాకుండా అనేక రకాల పంటలను క్రమపద్ధతిలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు. పంటమార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతంగా వినియోగించు. తక్కువ పెట్టుబడితో భూసారానికి నష్టం కలగకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అన్నదాతలు పంట మార్పిడి అవశ్యకతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకే తరహా పంట సాగుతో నష్టాలు

➤ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.

➤వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.

➤నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగు చేసుకోవాలి.

➤ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న-పత్తి.

➤నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి.

పంట మార్పిడితో భూసారం వృద్ధి

➤వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది.

➤వరి తర్వాత ఆపరాలు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉధృతి తగ్గుతుంది.

➤వరి తర్వాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగు చేమడం వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడితో మంచి దిగుబడులు

ఏటా ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరచూ సాగు చేస్తున్నారు. నీటి పారుదల ఉన్న చోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించుకునేందుకు పంట మార్పిడి విధానం చాలా ఉత్తమం. రైతులంతా విధిగా పంటమార్పిడి చేపట్టాలి.

–ఎస్. వెంకటేశ్వర్లు, ఏఓ, కృష్ణగిరి

క్లుప్తంగా

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న వైద్యాధికారి తిమ్మయ్య

హాలహర్వి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హాలహర్వి పీహెచ్‌సీ వైద్యాధికారి తిమ్మయ్య సూచించారు. ఇళ్లు, ఇంటి పరిసరాల్లో ఎక్కువ కాలం నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు ఉన్నచోట దోమలు ఉంటాయని, రాత్రి వేళల్లో దోమతెరలను వాడాలన్నారు. దోమకాటు వల్ల చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు సోకుతాయని తెలిపారు. జ్వరం, జలుబు, దగ్గు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలని సూచించారు.

బిల్లేకల్లులో డ్రైనేజీ కాలువలు నిర్మించాలి



బిల్లేకల్లులో రోడ్డుపై నిలిచిన నీరు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలోని ప్రధాన రహదారిలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రధాన రహదారిలో అధికారులు సిమెంట్ రోడ్డు వేసి డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో వర్షం నీరు రోడ్డుపై నిలువ ఉండి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైనేజీ కాలువలు నిర్మించి వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



అడుగంటిన ఫిల్టర్‌బెడ్

హొళగుంద: మండల కేంద్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఫిల్టర్‌బెడ్‌కు వచ్చే పైప్‌లైన్ లీకేజీ, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. వాటర్ వర్కర్స్, పంచాయతీ కార్మికులు లీకేజీ ఏర్పడ్డ ప్రాంతాలను గుర్తించి మరమ్మతు పనులు చేశారు. దెబ్బతిన్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేయడం, ఎస్ఎస్ ట్యాంకు, పంప్‌హౌస్ వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోండి

తుగ్గలి: వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణం పొందిన రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని మారెల్ల, ఉప్పర్లపల్లి సొసైటీ బ్యాంకు సీఈఓలు మనోహర్‌నాయుడు, గిడ్డయ్య కోరారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పొందిన రైతులు, సభ్యత్వం ఉన్న ఖాతాదారులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, పాన్‌కార్డు జిరాక్సులతో పాటు రెండు ఫొటోలు బ్యాంకులో అందజేయాలన్నారు. ఆధారాలు అందజేయని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే ప్రయోజనాలు వర్తించవన్నారు. కావున బ్యాంకులో సభ్యత్వం ఉన్న రైతులందరూ త్వరితగతిన రెన్యూవల్ చేసుకోవాలని కోరారు.

నేడు రేషన్ డీలర్లతో సమావేశం

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆలూరు మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖరయ్య తెలిపారు. డీలర్లతో పాటు వీఆర్వోలు హాజరుకావాలన్నారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ముస్లింలు, మతపెద్దలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలులో నేడు ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు: బక్రీద్ పండును పురస్కరించుకొని సోమవారం కర్నూలు నగరంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ పి.గౌతమి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ముస్లిం సోదరులు ప్రార్థన చేసుకోడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సోమవారం ఉదయం 6 గంటల నుంచి ప్రార్థనలు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను తుంగభద్ర బ్రిడ్జి వద్ద నుంచి తిప్పమ్మ కొట్టం నుంచి జాతీయ రహదారిపై వెళ్లేలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆలాగే బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు బళ్లారి చౌరస్తా మీదుగా గుత్తి పెట్రోల్ బంక్ బిర్లా జంక్షన్, సీక్యాంప్ మీదుగా నంద్యాల, నంది కొట్కూరు వైపు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నంద్యాల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మద్దూరు నగర్, బిర్లా జంక్షన్, గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు పోలీస్‌లకు సహకరించాలని కోరారు.

ఉత్తమ ప్రతిభకు పురస్కారం



ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న అక్షయ

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కాకి అక్షయకు ఆదివారం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి బహుమతి అందజేశారు. ఆదోనిలోని మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో వాల్మీకి ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విద్యార్థుల ప్రతిభా పురస్కార కార్యక్రమం జరిగింది. హొళగుందకు చెందిన కాకి సీతయ్య, కాకి రంగమ్మ కుమార్తె కాకి అక్షయ 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 565 మార్కులు సాధించింది. ఆమెకు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసే కృష్ణమ్మ బహుమతులు అందజేశారు. విద్యార్థిని ఎంఈఓ జగన్నాథం, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

నిరుపయోగంగా ఎస్సీ హాస్టల్ భవనం



నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనం

మద్దికెర: విద్యార్థులు తక్కువ ఉన్నారనే ఉద్దేశంతో హాస్టళ్లను ఎత్తివేశారు. దీంతో వారి కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రమైన మద్దికెరలో ఎనిమిదేళ్ల క్రితం ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు సొంత భవనం కోసం రూ. 75 లక్షలు మంజూరు చేసి నూతన భవనం నిర్మించారు. కానీ ఆరేళ్ల క్రితం తగినంత మంది విద్యార్థులు లేరని సాకు చూపి తీసివేసి అందులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఇతర హాస్టళ్లలో చేర్పించి అధికారులు చేతులు దులుపుకున్నారు. పేద విద్యార్థులందరికీ విద్యనందించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తే విద్యార్థులు లేరని సాకుచూపి ఎత్తివేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాన్ని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకైనా వినియోగించుకునేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పేద ముస్లింలకు సరుకుల పంపిణీ



మహిళలకు సరుకులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ

పత్తికొండ రూరల్: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 200 మంది పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమానికి ఎంపీపీ నాగరత్నమ్మ ముఖ్య అతిథిగా హాజరై చీరలు, సేమియా ప్యాకెట్లు, చక్కెర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 13 సంవత్సరాలుగా ట్రస్టు తరఫున ముస్లిం కుటుంబాలకు చేయూతనందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకుని పేదలకు తమకు చేతనైనంత సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూనా మల్లికార్జున, దండి మల్లికార్జున, బ్రహ్మయ్య, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ఆలయ అభివృద్ధికి విరాళం అందిస్తున్న నారాయణరెడ్డి

దేవనకొండ: గ్రామాభివృద్ధిలో గ్రామస్తులంతా భాగస్వాములు కావాలని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు, న్యాయవాది నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బాటమీద రాజన్న అన్నారు. ఆదివారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఎల్లమ్మపేట వీధిలోని ఎల్లమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టిన ఊరిని మర్చిపోకూడదన్నారు. గ్రామాభివృద్ధిలో తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఆలయ శిఖర నిర్మాణానికి రూ.25 వేలను నారాయణరెడ్డి అందజేశారు. అలాగే ఆలయ గోపుర నిర్మాణం పూర్తి అయిన తర్వాత రంగులు వేయిస్తామని హామీ ఇచ్చారు. 2017లో సర్పంచ్‌గా పనిచేసిన రాజన్న కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు గుర్తు చేశారు. సమావేశంలో వార్డు మెంబర్ మాదన్న, గ్రామపెద్దలు హనుమన్న, లక్ష్మన్న, పూజారి నారాయణస్వామి, వాసు, చిన్నహనుమంతు, పుల్లాపురం కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

పూల సాగును ప్రోత్సహించండి

- సంప్రదాయ పంటల స్థానంలో పూల సాగులో రాణించవచ్చు
- డిమాండ్, మార్కెటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని పూలసాగు చేపట్టాలి
- ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడు సూచనలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పూలతోటల అభివృద్ధికి చక్కటి అవకాశాలు ఉన్నాయని, సంప్రదాయ పంటల స్థానంలో పండ్లతోటల సాగును ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడ్ ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి పాల్గొని పూల తోటల అభివృద్ధి ఆవశ్యకతను వివరించారు. పూలతోటల్లో ముఖ్యంగా చామంతి, మల్లె, కనకాంబరాలు, బంతిపూలు సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూల సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తుంటారని, వారికి పూల సాగుపై అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్ దృష్టిలో ఉంచుకొని పూల సాగు చేపట్టాలని తెలిపారు. పూలతోటలకు ప్రధానంగా సూక్ష్మపోషకాల లోపాలు ఎక్కువగా కనబడుతాయని, మొగ్గదశలో బోరాన్, మెగ్నీషియం పిచికారీ చేస్తే పూల దిగుబడి పెరుగుతుందని, తద్వారా రైతులకు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ...నేడున్న పరిస్థితుల్లో సంప్రదాయ పంటలు కలసి రావడం లేదని, ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు.ఉద్యాన పంటల్లో పూలతోటల సాగు బాగా కలసి వస్తుందని తెలిపారు. పూల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు కూడా ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

మద్దికెర: ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని ఎస్ఐ రమేష్‌బాబు సూచించారు. ఆదివారం మండలంలోని ముస్లింలు ఎస్ఐను కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మతసామరస్యం వెల్లివిరిసేలా ఐకమత్యంతో పండుగ జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.

సోదరభావంతో మెలగాలి

ఆస్పరి: బక్రీద్ పండుగను సోమవారం ప్రశాంతంగా జరుపుకునేలా అందరూ సహకరించాలని సీఐ హనుమంతప్ప అన్నారు. గొడవలకు ఆస్కారం లేకుండా హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతీయకుండా పండుగ జరుపుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి వ్యవసాయ సహకార సంఘంలో రుణం తీసుకున్న రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని ఆ సంఘం సీఈఓ రామకృష్ణుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, సభ్యత్వాలు యథావిధిగా కొనసాగాలంటే రైతులు వారికి సంబంధించిన పొలం పాసుపుస్తకం, సహకార సంఘం బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్, పాన్ కార్డులతోపాటు రెండు ఫొటోలను అందజేయాలని సూచించారు. ఆధారాలు అందజేయని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సబ్సిడీలు వర్తించవని, ఈ విషయాన్ని గుర్తించి ప్రతి రైతు తమ ఆధారాలను అందజేయాలని కోరారు.

గాజులదిన్నె ప్రాజెక్టు పరిశీలన

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా క్రస్ట్ గేట్లు, జీడీపీలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. ప్రస్తుతం జీడీపీలో ఉన్న నీటి నిల్వ, జీడీపీ సామర్థ్యం, ఆనకట్టు ఎత్తు పెంచే పనులను, జీడీపీకి రావాల్సిన నీటి వాటా, నిధులు తదితర వాటిని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనకట్ట ఎత్తు పెంచే పనులు, గేట్ల పనులు ఇంకా పూర్తి కాలేదని వర్షకాలంలో వరద నీటితో ప్రాజెక్టు నిండి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రమాదం జరగక ముందే ఒక్క గేటు ఎత్తడానికైనా అవకాశం ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీఈ విజయకుమార్, ఏఈ మహమ్మద్ ఆలీ, ఆ పార్టీ నాయకులు నజీర్, బేతాలబడేసా, తిరుపతయ్య, రహంతుల్లా, రామాంజినేయులు, తదితరులు ఉన్నారు.

ఇతిహాసాలను గౌరవించాలి



సందేశమిస్తున్న ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు

కర్నూలు కల్చరల్: భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు పేర్కొన్నారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం నిర్వహించారు. హరినామ సంకీర్తనలతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భారీగా పొట్టేళ్ల అమ్మకాలు

- కిటకిటలాడిన ఎమ్మిగనూరు సంత
- రూ.50 వేల వరకు ధర పలికిన పొట్టేళ్లు



ఎమ్మిగనూరు మార్కెట్‌లో విక్రయానికి తెచ్చిన పొట్టేళ్లతో వ్యాపారులు


ఎమ్మిగనూరుటౌన్: బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో ఆదివారం స్థానిక మేకల మార్కెట్ క్రయవిక్రయదారులతో కిటకిటలాడింది. సోమవారం బక్రీద్ పర్వదినం కావడంతో వ్యాపారులు అధిక సంఖ్యలో పొట్టేళ్లను విక్రయానికి తీసుకొచ్చారు. పొట్టేళ్ల విక్రయాలకు జిల్లాలో పేరొందిన మార్కెట్ కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండే గాకుండా తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రాల నుంచి ముస్లింలు ఖుర్బానీ ఇచ్చేందుకు పొట్టేళ్ల కొనుగోలు కోసం భారీ సంఖ్యలో తరలివచ్చారు. బక్రీద్ పండుగకు దంతాలు ఉండి ఏడాది వయసున్న పొట్టేళ్లను ఖుర్బానీ ఇవ్వాలన్న ఆచారం ఇస్లాంలో ఉండటంతో ఆ మేరకు పెద్ద పొట్టేళ్ల క్రయవిక్రయాలు జరిగాయి. పొట్టేళ్లు ఒక్కోటి రూ.16 వేల నుంచి రూ.50 వేలకు పైగా ధర పలికాయి. పొట్టేళ్లను ఏడాది పాటు పెంచి పోషించి అమ్ముకొనే ఈ ప్రాంత రైతులు మాత్రం ధరలను కొంతమేర తగ్గించి విక్రయించినా వ్యాపారులు మాత్రం అనుకున్న ధరలకు విక్రయించుకొని వెళ్లారు. పండుగకు కేవలం ఒక్కరోజు ముందుగా ఆదివారం సంత జరగడంతో పొట్టేళ్ల కొనుగోళ్లు భారీగా జరిగాయి.

ఘనంగా గంగాభవానీ జయంత్యుత్సవాలు



అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

- ప్రధాన రహదారుల్లో అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు
- పెద్దసంఖ్యలో పాల్గొన్ని పులకించిన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ దేవి

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీ గంగాభవానీదేవి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. తుంగభద్ర నుంచి తెచ్చిన నీటితో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని వాహనంలో ఉంచి ప్రధాన రహదారుల్లో ఊరేగించారు. చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొనగా డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని లక్ష్మమ్మవ్వ ఆలయానికి చేరి అమ్మవారికి పూజలు నిర్వహించి తిరిగి అదే ప్రధాన రహదారుల్లో ఊరేగింపుగా గంగాభవానీ ఆలయంకు చేరుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఊరేగింపులో జై గంగాభవానీ నామస్మరణ మార్మోగింది. భక్తులు ఎరుపు జెండాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు, కులపెద్దలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



- నేడు ఈదుల్ అజ్హా ప్రత్యేక నమాజ్
- ఈద్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

గడివేముల: ముస్లింల పర్వదినమైన బక్రీద్ (ఈదుల్ అజ్హా)ను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే జంతువు, ఈద్ అంటే పండుగ. జంతువును ఖుర్బానీ ఇచ్చే పండుగ కాబట్టి దీనిని ఈదుల్ ఖుర్బానీ అని కూడా అంటారు. త్యాగనిరతతో పాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగ ద్వేషాలను విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగ ఆంతర్యం.

బక్రీద్ విశిష్టత

ఖురాన్ ప్రకారం భూమిపై అల్లాహ్ ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఆయన మక్కా పట్టణాన్ని నిర్మించారు. ప్రార్థనల కోసం కాబా అనే ప్రార్థనా మందిరాన్ని నిర్మించి దైవ ప్రవక్తగా నిలిచారు. ఇబ్రహీంకు లేకలేక కలిగిన సంతానం ఇస్మాయిల్. ఇబ్రహీమ్‌కు అల్లాహ్ పలు రకాలుగా పరీక్షిస్తాడు. అందులో భాగంగా ఒక రోజు కలలో తన కుమారుడు ఇస్మాయిల్ మెడపై కత్తితో కోస్తున్నట్లు కలొచ్చింది. అల్లాహ్ ఖుర్బానీ కోరుతున్నాడని ఒంటెను బలి ఇస్తాడు. మళ్లీ అదే కల రావడంతో ఇస్మాయిల్‌ను అల్లాహ్ బలి కోరుతున్నాడని భావించి కొడుకును బలి ఇవ్వబోతాడు. ఆ త్యాగాన్ని మెచ్చిన అల్లాహ్.. ఇస్మాయిల్ స్థానంలో ఓ జీవాన్ని బలి ఇవ్వమని జిబ్రాయిల్ అనే దూత ద్వారా ఇబ్రహీంకు తెలియజేస్తాడు. అప్పటి నుంచి బక్రీద్ పండుగ రోజున జీవాన్ని బలి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది.

ఖుర్బానీకి ప్రాధాన్యం

ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు. ఒక పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర మక్కాను సందర్శించడానికి వెళతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణాలు చేస్తారు. బక్రీద్ రోజు ముస్లింలు అందరూ ఈద్ గాహ్ చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు.